# వాడు ! - ఆమె !

నాకు వక్కగానొక్క మగపిల్లాడు! వాడు కాస్త అమెరికా వెళ్లిపోయాడు. పెళ్లి సంగతేమిట్రా అన్నప్పుడల్లా ఏవో కాకమ్మ కబుర్లు చెప్పి మాట దాటేస్తూ వస్తున్నాడు!. ఇలా ఎన్నాళ్లని?- ఖర్మగాలి అమెరికాలో వుద్యోగం చేస్తూ అక్కడే శాశ్వతంగ వుండిపోవాలనుకుని అక్కడి ఇంగ్లీషు పిల్లదాన్నెవరినైనా పెళ్లి చేసుకోవాలనుకోవటంలేదు కదా? ఈ డౌటు నాలో ఇటీవలే మొదలైంది. ఈ వార్త శ్రీమతితో చెప్తే లబోదిబో మొత్తుకుంటుందని నాలోనే దాచుకున్నాను.

బ్యాంకు ఆఫీసర్ చేసి రిటైనాను! మా గ్రామంలో పదెకరాల పొలం వుంది. కానీ మొదటి నుండి సిటీలో వుండటం అలవాటైన కారణంగ రిటైరయ్యాక వెళి మా పల్లెటూళ్లో సెటిలవతల్చుకోలేదు.

పైగా అక్కడుంటే పిల్లవాడికి సంబంధాలు మంచివి రాకపోవచ్చన్పించటంతో సిటీలో ఓ విలా& కట్టుకుని నేను నా శ్రీమతి హేపీగా రోజులు గడిపేస్తున్నాం!

నా శ్రీమతికి తొందరెక్కువ! నోరు కూడా ఎక్కువే! నేను మాత్రం తక్కువ తిన్నానా?... నిద్రపోయేటప్పుడు తప్పవ డిగతా సమయాల్లో ఏదో ఒక హస్కు కొడుతూండడం నా హాబీ ! - చిన్నతనంలో ఫ్రెండ్స్ అంతా నన్ను 'వాగడుకాయ' అనికూడా పిలిచేవారు. మా అమ్మ నాకు 'వస' ఎక్కువ పోసి వుండి వుంటుంది. లేకుంటే ఇంతటి వాగుడెందుకు అబ్బుతుంది?

అన్నీ వున్నా అల్లుడినోట శని వుందనే సామెతలా అంతస్థు ఆస్తిపాస్తులున్నా... పిల్లవాడు అమెరికాలో జాబ్ చేస్తున్నా... వాడికి తగిన సంబంధాలు రావటం లేదనే దిగులు మా దంపతులను పీక్కుతింటోంది.

వాడు ఇండియాకొచ్చి నాలుగేళ్లయింది. ఇలా అయితే కొన్నాళ్లకు వాడు మమ్మల్ని మర్చిపోతాడేమోనే భయం మమ్మల్ని కలచివేస్తోంది. వాడికా వయసు మీరిపోతోంది బ్రహ్మచారి ముదిరితే పెళ్లి సంబంధాలు రావు సరికదా పిల్లవాడికి పెళ్లి అయ్యే అవకాశమే వుండదు.

అమెరికాకు వెళ్లద్దురా... హాయిగా ఇక్కడే మంచి జాబ్ చూసుకోరాని నెత్తీ నోరు మొత్తుకున్నా వినేదు. వెళ్లి తీరాల్సిందేనని వెళ్లాడు.

తీరా వెళ్లాక తిరిగి ఇక్కడికి రావాలంటే సెలవు దొరకటం లేదంటాడు.

రాలేకపోతున్నానంటాడు. ఇదంతా నిజమో అబద్ధమో ఏదైనదీ అర్థం కావటంలేదు.

నాలో ఒక డౌటు వుత్పన్నమౌతోంది. ఖర్మకాలి అక్కడి పిల్లనెవరినైనా మాతో చెప్పకుండా చేసుకున్నాడాని నా అనుమానం నివృత్తి అయ్యేదెలా?. ఈ ప్రశ్నకు సమాధానం కోసం నేను అమెరాకా వెళ్లిరావటమంటే మాటలా? ఎంత లేదన్నా లక్షకు పైగా ఖర్చవుతుంది. ఆ విధంగ ఖర్చుచేయటం శుద్ధవేస్ట్ అన్పించటం వల్లే నేను అక్కడికి వెళ్లే ప్రయత్నం చేయలేకపోయాను.

వాడు చికాగోలో ఇల్లు కట్టుకున్నాడని... కారు కొన్నాడని... జీతం పెరిగిందని... ప్రమోషన్ వచ్చిందని నెట్లో ఛాట్ చేస్తున్నప్పుడు చెప్తూంటే నేను నా శ్రీమతి ఎంతగానో మురిసిపోతున్నాం.

అంటే వాడు అమెరికాలో సెటిలవుతాడన్న మాట! అక్కడి సిటిజన్ కాబోతాడు! ఇక ఇక్కడికెందుకొస్తాడు?. మాతో ఎందుకుంటాడు? ఇక్కడి పల్లను పెళ్లి ఎందుకు చేసుకుంటాడు?- వృద్ధాప్యం ముంచుకొచ్చి మేం కాస్తా 'హరీ' అంటే మా తలకొరివి పెట్టటానికైనా వస్తాడో? రాడో?- ఇందుకేనా కొడుకు కావాలని ఆరాటపడింది?

'ఏమండీ... అబ్బాయి పెళ్లి చేసుకోవటానికి రాకపోయినా... మనలను చూడటానికైనా రాడా?. నాకు బెంగగావన్నదండీ...' భోజనం వడ్డిస్తూ చెప్పింది శారద.

అవును. తాను చెప్పేది అక్షరాల నిజం! నా కొడుకు అమ్మకూచి! టెన్త్ పాసయ్యేదాకా అమ్మ పక్కలోనే పడుకునేవాడు. ఫారిన్ వెళ్లేదాకా అమ్మ చేతి ముద్దనే తినేవాడు. వాడంతటవాడు కలుపుకుని భోజనం చేసిన రోజులు బహుతక్కువ.

'ఇదిగో... వాడి గురించి దిగులు పెంచుకుని మంచం పట్టేను... చూడాలని తహతహలాడుతున్నావ్ కదా... ఇద్దరం కలిసి పిల్లవాడి దగ్గరకు వెళి ఓ నెల్లాళ్లుండి వద్దాం పదరాదు?-'

'అయ్యో రామ! విమానం నేనెక్కలేను బాబూ! నా కసలే గుండె దడదడ... బీ.పీ! ఆటో ఎక్కట్టానికి ఇష్టపడని నేను ఎయిరోప్లేన్ ఎక్కటం కూడానా నా బతుక్కి... వాడు వచ్చినప్పుడే వస్తాడు...' శారద మాటల్లో కాస్తంత బాధ మరికాస్త అలక ద్యోతకమైంది.

'మనవాడనే కాదు, ఈ రోజుల్లో మగపిల్లలంతా ఇలాగే ఏడ్చారు. కడుపున పుట్టిన పిల్లలని మనం విలవిల్లాడటమే గానీ... తనను చూడాలనే దిగులుతో మంచం

పట్టిందని అబద్ధం చెప్పండి. అప్పుడైనా మనలను చూడటానికి వచ్చి ఏడుస్తాడేమో...?-'

కూర్చున్నవాడినల్లా లేచి కంప్యూటర్ వద్దకెళ్లి నెట్ ఓపెన్ చేశాను. కానీ ఓపెన్ అవకపోవటం చూచి ముక్కున వేలేసుకున్నాను. పదేపదే వాడితో నెట్లో మాట్లాడుతూ ఇబ్బందిపెడుతూండటంతో కనెక్షన్ తీసేయించుకున్నాడో ఏం ఖర్మో?... రామరామ.... ఇప్పుడు వాడిని కాంటాక్ట్ చేయటం ఎట్లా? ఐ.ఎస్.టి.డి. ఫెసిలిటీ వున్న టెలీఫోన్ బూత్ వద్దకు వెళ్లాల్సిందే! నావద్ద వున్న సెల్‌ఫోన్‌తో వాడితో మాట్లాకే వీలు లేదు. వినాయకుడి పెళ్లికి అన్నీ విఘ్నాలే అన్నట్టుంది పరిస్థితి !

వాడితో ఛాట్ చేసి కూడా నెలపైనే అయింది. విశేషాలేం లేకపోవటం మూలాన మాట్లాడటం డిలే అయింది. ఎప్పుడు మాట్లాడదామని ప్రత్నించినా పెళ్లి విషయం కాకుండా మరో విషయమేదైనా వుంటే మాట్లాడండి అంటూ నా నోరు మూయించేవాడు. ఇప్పుడు వాడితో మాట్లాడే అవకాశం కూడా లేకుండాపోయె! శ్రీరామచంద్రప్రభో ఏలనయ్యా మాకీ కష్టాలు!... అనేసి వాపోయాను.

X X X

ఇంటిముందు 'టాక్సీ' ఆగటం చూచి సిటౌట్లో కూర్చుని పేపరు తిరగేస్తున్న వాడినల్లా తల తిప్పి వీధిలోకి తొంగిచూచాను.

అరె... వాడే!... నా పుత్రరత్నం టాక్సీ దిగుతూ అవుపించటంతో దిగ్భ్రాంతికి లోనయ్యాను. చెప్పాపెట్టకుండా సడన్‌గ వూడిపడ్డాడేమిటి చెప్మా?. మమ్మల్ని ఆశ్చర్యాంబోధిలో ముంచేయాలనుకున్నాడా? అనుకుంటూ 'ఏమేవ్ అబ్బాయొచ్చాడు. త్వరగారా?-' గావుకేక పెట్టి కూర్చున్న వాడినల్లా లేచి వాడికి ఎదురెళ్లి 'రారా..రా!.. ఇదేనా రావటం' అంటూ స్వాగతం పలికాను.

వాడొక్కడే రాలేదు. వాడితోపాటు మరో ఇంగ్లీషు దొరసానితో వచ్చాడు. ఈవిడ ఎవరు? మావాడివెంట ఎందుకొచ్చిందీ... నాలో నేను ప్రశ్నించుకుంటూ ఇద్దరినీ లోనికి ఆహ్వానించాను.

ఇంతలో శారద రానే వచ్చింది. 'ఇన్నేళ్లకు కన్నవాళ్లం గుర్తొచ్చామట్రా...?-' కొడుక్కి దగ్గరై ఆప్యాయంగా తలనిమిరింది.

అన్నింటికీ నవ్వే సమాధానమైంది !

'వాడిని కాస్త స్థిమితపడనీవే! వేలమైళ్లు ప్రయాణం చేసి అలసిపోయివుంటాడు. వెళ్లి రెస్ట్ తీసుకోనీ తర్వాత మనతో తీరుబడిగ మాట్లాడతాడు...' సర్దిచెప్పాను.

రమణ వెంట వచ్చిన లేడీతో ఇద్దరూ మేడమీది బెడ్‌రూమ్ వైపు నడిచివెళ్లారు.

'మూగపిల్లల్లా మాటపలుకు లేకుండా మనవాడి వెంట నడిచివెళ్తున్న ఆ అమ్మాయి ఎవరండీ? -' మొగుడ్ని నిలేసింది శారద.

'ఏడ్చినట్టుంది!- నాకుమాత్రం ఏం తెలుసు?- అడుగామనుకుంటూండగానే నువ్వొస్తివి... తొందరెందుకు? తర్వాత నీరుబడిగ అన్ని విషయాలు వాడే చెప్తాడులే...' శారదకు సద్దిచెప్పాను.

కిచన్లోకెళ్లి రెండు కప్పుల్లో కాఫీచేసి పోసి వాళ్లిద్దరికోసం మేడ మీది గదిలోకెళ్లింది శారద.

మంచం మీద వెల్లకిలా పడుకున్న రమణ నోట్లో థర్మామీటరు... వాడి కుడిచేతిని ఆమె తన చేతిపట్టుకుని నాడి పరీక్షించటం శారద కంటపడింది.

'ఏమైందమ్మా నా కొడుక్కి?' కంగారుపడుతూ ప్రశ్నించి తెచ్చిన కాఫీ ఇద్దరికీ ఇచ్చింది.

'ఏంలేదమ్మా... ప్రయాణం చేసొచ్చాను కదా!- ఆరోగ్యం ఎలావుందోని చెకప్ చేస్తోంది... అంతే !...' లేచి కూర్చుని తల్లి అందించిన కప్పు కాఫీ అందుకుని కాఫీ సిప్ చేశాడు రమణ.

'ఈ పిల్లెవర్రా?...'

'అమెరికాలో నా ఫ్రెండు! ఈమె డాక్టర్... మిమ్మల్ని చూడాలనే ఆపేక్షతో నావెంట వచ్చింది...'

'సరేసరే... వేడినీళ్లు పెడతాను మీరు స్నానాలు కానీయండి... ఇంతలో టిఫిన్ తయారు చేస్తాను...' గిర్రన కిందికొచ్చేసింది శారద.

'ఆవిడగారు డాక్టర్ ఫ్రెండట! నాకు నమ్మబుద్ధి కాలేదు. మనలను చూడాలని వాడి వెంట వచ్చిందని చెప్తే నేను నమ్మద్దూ...' క్రింది హాల్లోకి రాగానే నా చెవి కొరికింది.

'ఆడ బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు. నీకు అంతా తొందరే... అన్నీ అనుమానాలే!. అనుమానం ముందు పుట్టి ఆతర్వాత నువ్వు పుట్టావ్. ఎవరైనా అతిథులు ఇంటికొచ్చినపుడు నోరు కాస్త అదుపులో వుంచుకో...' చురక అంటిచాను.

అక్కడితో నోరుమూసుకుని వంటింట్లోకి నడిచింది!

X X X

'మనవాడిని చూస్తుంటే... వెనటిలా లేడన్పిస్తోంది. వాడివెంట వచ్చిన డాక్టరమ్మేమో ముప్పొద్దులా టెంపరేచర్ చూస్తూంటుంది. ఏవో మందు బిళ్లలు... గొట్టాలు వాడిచేత రోజుకు నాలుగైదు సార్లు మింగిస్తోంది. మధ్య మధ్య ఇంజక్షన్ కూడా చేస్తోంది. ఎందుకురా ఈ ట్రీట్‌మెంట్ అనడిగితే మన వాడేమో నోరు విప్పడు. డాక్టరేమో సమాధానం చెప్పదు. మీరు ఇవన్నీ గమనించారా?-' శారద భర్తతో ఫిర్యాదు చేసింది.

'నేనెప్పుడు మాట్లాడదామని ప్రత్నించినా... మన వాడివెంట ఆ దొరసాని మహాతల్లి అంటిపెట్టుకుని వుంటుంది. ఇక ఇంటి విషయాలు వాడితో మాట్లాడి చచ్చేదెప్పుడో నాకు అర్థంకాకుండా వుంది...' బాధతో నిట్టూర్చారు.

'నాకు తెలియక అడుగుతాను... ఏ జబ్బు లేనిదే మనవాడిచేత అన్నిన్ని మందులు ఎందుకోసం ఆ డాక్టరమ్మ మింగిస్తున్నట్టు?.. మనవాడిని అసలు మేడమీది గదిలో నుంచి క్రిందకు దిగిరానివ్వకుండా డాక్టరమ్మ కట్టడిచేస్తోందండీ...' శారద మాటల్లో బాధ వుట్టిపడింది.

'వాడు చూడబోతే అలా మంచానికి అంటిపెట్టుకుని మందులు మింగుతూంటే.. ఇకవాడి పెళ్లి విషయం ఏముఖం పెట్టుకుని మాట్లాడటం మాని... అంతా అయోమయంగా వుంది.

'డాక్టరమ్మను క్రిందికి రమ్మని మనిద్దరం చెరొకవైపు ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి జవాబు రాబట్టాలే...'

'నాకు ఇంకో డౌటు... ఆ డాక్టర్ దొరసానిని మనవాడు లవ్వాడి పెళ్లి చేసుకోలేదు కదా?- లేకపోతే ఒక డాక్టరమ్మ మనవాడి వెంట అమెరాకా నుండి ఇంత దూరం వస్తుందాని? మనవాడికి ఆరోగ్యం బాగోలేదనే అనుకుందాం... ఇక్కడ అస్పత్రులులేవా?.. డాక్టర్లు లేరా?... అంతా చోద్యంగా వుంది...'

ఇంతలో లేడీ డాక్టర్ మేడ దిగి కిందకు రావటంతో మనోళ్లు మూత పడినయ్.

'హలో డాక్టర్!... ప్లీజ్ కమ్ హియర్... ఐ కాంట్ టు టాక్ విత్ యూ...'

'చెప్పండి అంకుల్... ఏమడగాలని అనుకుంటున్నారు మీరు?-'

అమ్మ దీని దుంపతెగ దీనికి తెలుగు మాట్లాడటం వచ్చునే... రాదేమో

అనుకున్నాను. పైగా స్వచ్ఛమైన నూటికి నూరుపాళ్ల తెలుగు మాట్లాడుతోంది... అని ఆశ్చర్యపోయాను.

'ఓహెూ!- నీకు తెలుగు వచ్చునే...'

'నేను తెలుగు ఆడపడుచునే! మాది పశ్చిమగోదావరి జిల్లాలో కాకినాడు...'

'మీ పేరెంట్స్ ఎక్కడుంటున్నారు?'

'మా మమ్మీ పై చదువు కోసం ఆరోజుల్లోనే స్టేట్స్ వెళ్లింది. అక్కడనే స్థిరపడింది-మా డాడీ మాత్రం అమెరికన్! ఆయన పెద్దక సైంటిస్ట్ - బైదిబై మీ అబ్బాయి రమణ మా యింట్లోనే పేయింగ్ గెస్ట్‌గా వున్నాడు మొదట్లో తర్వాత మా బంగళా పక్కనే తనూ ఓన్ హౌస్ కట్టించుకున్నాడు....'

అడక్కుండానే వివరాలన్నీ ఏకరువుపెట్టింది.

'నా పేరు మార్లన్ ! నేను సగం ఇండియన్ సగం అమెరికన్! చికాగోలో వున్న ఓ ప్రముఖ హాస్పిటల్లో సర్జన్‌గ వర్క్‌చేస్తున్నాను. మీ అబ్బాయి రమణ చాలా చాలా మంచివాడు అంకుల్. మీరు అంటీ కూడా చాలా మంచివాళ్లు...'

ఓసిదీని తస్సచెక్క! నాలాగ ఇదీ వాగుడుకాయే!- అసలు విషయం దాచి మిగతావన్నీ ఛాటర్ బాక్స్‌లా లొడలొడ వాగేస్తోంది!

'అవునూ... నీకు మ్యారేజ్ అయిందా? 'మా డౌట్ క్లియర్ అవుతుందని అడిగాను.

నీకు మ్యారేజ్ అయిందా?' మా డౌటు క్లియరౌవుతుందని అడిగేశాను.

'లేదు అంకుల్...'

'ఏమిటీ... లేదా?...'

'ఏం? ఎందుకని పెళ్లి చేసుకోలేదు'

'అమెరికాలో అందరివీ లేట్ మ్యారేజెసే?-'

అంతేనా.. కొంపదీసి మా అబ్బాయిని ప్రేమించి ఏడుస్తున్నవా?- ఆల్‌రడీ రిజిస్టర్ మ్యారేజ్‌గాని చేసుకొని అఘోరించలేదు. పెళ్లి అయినది లేనిదీ విదేశీవనితలను చూచి అర్థం చేసుకోవటం కష్టమే! మెడలో తాళి కాలి వేళ్లకు మట్టెల్లాంటివి వుండి ఏడవ్వు కదా... మనసులోనే మథనపడ్డాను. శారదాంబ నాకేసి అదోలా చూచింది. దాని చూపులో ఎన్నో భావాలు వుట్టిపడినయ్. తొందరపడి వాగబోకు అనే సూచన కళ్లతో చేయటాన శారద నోరు విప్పలేదు. లేకపోతే రసాభాస అయివుండేదే!

'మావాడికెట్లాగూ పెళ్లికాలేదు. వాడేమో అమెరికాలోనే శాశ్వతంగ వుండిపోవాలని అక్కడే ఇల్లు కూడా కట్టుకుని గ్రీన్ కార్డ్ హెూల్డర్ కాబోతున్నాడాయె?- అంచేత నీవూ అనమేదీడే కనుక... ఎంచక్కా మావాడిని మ్యారేస్ చేసేసుకో! మీ వుభయులకూ ఆనందం... మాకేమో లాంగ్‌పెండింగ్‌లో వున్న మావాడి పెళ్లి సమస్య తీరినట్టూ వుంటుంది ఏమంటావ్ - ఇలా అన్నానని నన్ను అపార్థం చేసుకోకు! మీ జంట చిలకా గోరింకల్లా వుంటుంది. ఏమంటావ్?-'

'అంకుల్! మేము మంచి స్నేహితులం. మామధ్య ప్రేమ అనుర్రాగాల్లేవు. పెళ్లి ఆలోచనే మాకు లేదు...' నవ్వింది మార్లిన్.

ఇంతలో మేడ మెట్లు దిగి వస్తున్న రమణ అనుకోకుండా బ్లడ్ వామిటింగ్ చేసుకుని స్పృహ తప్పి పడిపోవటంతో మేమంతా కంగారుపడ్డాం ! కొడుకు పరిస్థితి కళ్లారా చూచిన శారద శోకాలు పెడుతూ గుండె బాదుకుంది.

'డోన్ట్ వర్రీ... డోన్ట్ వర్రీ... నేను ఇంజక్షన్ ఇస్తాను...' అనేవి మందు సిరంజ్ కోసం మార్లిన్ మేడ మీదికెళ్లింది.

'అది సరేనే వీడిని ఏదైనా కార్పోరేట్ హాస్పిటల్లో చేరిస్తే బావుంటుందేమో...' అని నేను అంటూండగా మార్లిన్ మేడదిగివస్తూ నామాట విన్నది కోబోలు...' అక్కర్లేదు అంకుల్ ఈ వ్యాధికి మందు ఇంకా కనిపెట్టలేదు. మెడికల్ టెరిమినాలజీలో ఇవ్వగలిగింది సిస్టమేటిక్ ట్రీట్‌మెంట్ మాత్రమే!' అని చెప్తూ ఇంజక్షన్ చేసింది.

నాకు శారదకు కొడుకు పరిస్థితి కల్లారా చూస్తూ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నయ్. మా మనసులు ఏదో కీడు శంకిస్తున్నయ్.

ముగ్గురం కలిసి రమణను కిందనే వున్న మరో బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్లి పడుకోబెట్టాం.

XXX

ఇండియన్ కరెన్సీతో వున్న సూట్‌కేస్ తెచ్చి నాకు అందించిన మార్లిన్ 'ఇది మీకు చెందవలసిన డబ్బు! మీ అబ్బాయి చికాగోలో కట్టించిన బంగళా అమ్మేశాడు. దాని తాలూకు డబ్బే ఇది. కారు నేనే కొనుక్కున్నాను. బ్యాంకు బేలన్సేమీ లేదు రమణకు ! - రమణకు సంక్రమించిన కొత్త వ్యాధి మరికొందరికీ సోకటంతో అలాంటి వ్యాధిగ్రస్తులనందరినీ వారివారి దేశాలకు బలవంతాన పంపతోంది అమెరికన్

గవర్నమెంట్. వంటరిగా ప్రయాణం చేయలేడని భావించిన నేను రమణ వెంటనేనొచ్చాను...'

'అమ్మాయ్ మార్లిన్... నువ్వు చెప్తున్నది వింటుంటే మాలో దు:ఖం పొర్లుకొస్తోంది. ఇంతకూ మావాడి పరిస్థితి ఏమిటో నువ్వే చెప్పాలి!. వీడి భవిష్యత్ గురించి ఎన్నో కలలు కన్నాం! మమ్మల్ని ఉద్ధరిస్తాడని ఆశలు పెట్టుకున్నాం ! పెళ్లి కూడా కాని మావాడికి ఎట్లా దాపురించిందమ్మా ఈ మహమ్మారి రోగం?...' శారదలో దు:ఖం కట్టలు తెంచుకుంది.

'పరిస్థితి మీరే చూస్తున్నారుగా... ఆ దేవుడే రమణను కాపాడాలి ! ఏ కార్పోరేట్ హాస్పిటల్లోనూ మీ అబ్బాయిని చేర్చుకోరు. కారణం... ఈ సరికొత్త వ్యాధికి మందుల్లేవు కాబట్టి !'

'ఓరి దేవుడా... ఒక్కగానొక్క కొడుకు మాకు దూరమవక తప్పదా?- గర్భశోకం అనుభవించటానికేనా ఈ వయసులో మేమింకా బ్రతికి వుంది...' దు:ఖాన్ని ఆపుకోలేకపోతోంది శారద.

'ఏ జన్మలోనో మనం చేసుకున్న పాప ఖర్మ ఫలితమేనే ఇది.... ఏడవకు శారదా...' ఓదార్చబోయాను.

'ఒక డాక్టర్ ఫ్రెండ్‌గా నేను చేయగిలిగనదంతా చేశాను రమణను అతనికి చెందిన డబ్బును మీ పరం చేశాను. మీకు పూర్వపరాలు వివరించాను. ఈ రోజు గడిస్తే... రమణ మరికొద్దికాలం జీవించగల అవకాశం వుంటుంది...' గద్గదస్వరంతో చివరగా తాను చెప్పగలిగింది వివరించింది.

రమణ పరిస్థితి ఎలావుందో చూచిరావటానికని బెడ్‌రూమ్‌లోకెళ్లిన మార్లిన్ కొద్దిసేపటికే అశ్రుపూరిత నయనాలతో తిరిగొచ్చి... 'రమణ మనకి లేడు... ఆఖరిశ్వాస విడిచి మనలను వదిలి శాశ్వతంగ వెళ్లిపోయాడు.' అని చెప్పలేక చెప్పలేక చెప్పింది.

మరక్షణమే మా ఇల్లు శోక సంద్రమైంది.

---సమాప్తం---